క్లుప్తంగా

నేటి నుంచి గ్లకోమా వారోత్సవాలు



డాక్టర్ మీనాక్షి

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఏటా నిర్వహిస్తున్న గ్లకోమా (నీటి కాసులు) వారోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 15 వరకు నిర్వహిస్తామని జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు. ఈ వారం రోజుల్లో రోజూ ఉదయం 9 గంటల నుంచి రామాటాకీస్ సమీపంలో గల ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ప్రత్యేక గ్లకోమా స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు. గ్లకోమా వైద్య నిపుణులు డాక్టర్ సౌజన్య, వాణిశ్రీ వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ముఖ్యంగా కళ్లద్దాలు వాడుతున్న వారు, రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు తప్పకుండా గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పారా మెడికల్ సిబ్బందితో గ్లకోమా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో బాలభోగం నివేదన అనంతరం అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం విశేష హారతి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థులకు ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న ఈసీఈ విభాగాధిపతి ఆచార్య జె.బాబు

సీతంపేట: వెరీలాగ్ హెచ్‌డీఎల్ ప్రోగ్రామింగ్‌పై పట్టు సాధించిన ఇంజినీరింగ్ విద్యార్థులకు దేశ విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని ఈసీఈ విభాగాధిపతి ఆచార్య జె.బాబు అన్నారు. బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ ఫైనలియర్ విద్యార్థులకు రెండు వారాలుగా వెరీలాగ్ హెచ్‌డీఎల్ ప్రోగ్రామింగ్‌పై జరుగుతున్న వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రానిక్ సర్క్యూట్ డిజైన్లు, సిమ్యులేషన్లపై అవగాహన పెంపొందించుకున్న విద్యార్థులకు సొంతంగా ప్రాజెక్టులు తయారుచేసే సమయంలో ఈ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, వర్క్‌షాప్ కోఆర్డినేటర్స్ రజియాబేగం, బి.సంగీత్‌కుమార్, ప్రిన్సిపాల్ డి.దీపక్‌చౌదరి, అధ్యాపక సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఘనంగా వేంకటేశ్వరుని పరస




ప్రత్యేక పూజల్లో భక్తులు, కమిటీ సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధి తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పరస మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి కలశ ప్రతిష్ట చేశారు. ఉదయం నుంచి విశేష పూజలు, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన, మంగళ శాసనాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పాలకవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మహిళా సాధికార భవనం ప్రారంభం

అరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు వివేకానందనగర్‌లోని మహిళా సాధికార భవనాన్ని మహిళా దినోత్సవం సందర్భంగా జోన్–2 అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీన్ని శనివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించి మాట్లాడారు. ఈ భవనంలో మహిళలకు చేతి వృత్తుల్లో శిక్షణలు ఇస్తారన్నారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు 3 నెలల పాటు టైలరింగ్ శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, జోన్–2 ఇన్‌ఛార్జి కమిషనర్ కనకమహాలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.



వాల్తేర్ డివిజన్‌లో మహిళల పాత్ర అద్భుతం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్‌లో మహిళల పాత్ర ఎంతో అద్భుతంగా ఉందని, కీలక విభాగాల్లో సైతం పురుషులతో సమానంగా రాణిస్తున్నారని డీఆర్‌ఎం లలిత్ బోరా తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో శుభం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్తేర్ డివిజన్‌లో మహిళలు చాలా చురుగ్గా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ట్రాక్ మెయింటనెన్స్, ట్రైన్ ఆపరేషన్స్‌తోపాటు, రూట్ రిలే ఇంటర్‌లాకింగ్, ట్రైన్ మేనేజ్‌మెంట్, లోకో ఆపరేషన్స్, టికెట్ తనిఖీలు, ఇతర కీలక విభాగాల్లో కూడా మహిళలు చక్కగా విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. లోకో షెడ్స్‌లో ప్రత్యేక మహిళా బృందాలను ఏర్పాటు చేసినట్లు, మహిళల భద్రత కోసం మేరీ సహేలి, సుభద్ర వాహిని వంటి ప్రత్యేక బృందాలను వాల్తేర్ డివిజన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం గీతం వర్సిటీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ (హెచ్ఆర్) కీర్తి ఒత్తిడి నియంత్రణపై ప్రసంగించారు. డాక్టర్ రమ్య స్పందన మహిళల ఆరోగ్యం, పోషకాహారంపై వివరించారు. కార్యక్రమంలో డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాషిణి ప్రియాంక, సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.తరుణ్, సీనియర్ అడ్వకేట్, వావా ప్రెసిడెంట్ అనురాధ పప్పు, ఏడీఆర్‌ఎంలు మనోజ్ కుమార్ సాహూ (ఆపరేషన్స్), ఈ.శాంతారాం (ఇన్‌ఫ్రా), సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ యూసుఫ్ కబీర్ అన్సారి, మహిళా సిబ్బంది, అధికారులు, మహిళా క్రీడాకారులు, ఆర్పీఎఫ్ సిబ్బంది, సివిల్ డిఫెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా
మహిళల రాణింపు



డ్యాన్స్‌తో అలరిస్తున్న ఉపాధ్యాయినులు



మహిళలను సత్కరిస్తున్న దామోదర మనోహర్

సీతంపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం నియోజకవర్గంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, సాహిత్య సంస్థల్లో వేడుకలు నిర్వహించి, వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్), గాంధీ సెంటర్ సంయుక్తంగా బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇస్కఫ్ ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు అధ్యక్షతన జరిగిన సభలో గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడారు. భారతదేశ చరిత్రలో మహిళల పట్ల వివక్ష కొనసాగిందని, ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తుండటం మంచి పరిణామమన్నారు. మార్కండేయులు మాట్లాడుతూ సాంఘిక దురాచారాల మధ్య వంటింటికే పరిమితమైన నాటి నుంచి, నేడు అంతరిక్షం వరకు ఆకాశమే హద్దుగా మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా సత్తా చాటుతున్నారని తెలిపారు. మహిళా సాధికారతతోనే సమాజం, దేశం అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ఎం.ఎ.బేగం, రాజమాణిక్యం, రమణిలను సత్కరించారు. కార్యక్రమంలో టి.ఎస్.సుకుమారన్, రాంప్రభు, అహ్మదున్నీసా బేగం, సీహెచ్.మధుబాబు, జి.ఎస్.సూర్యకుమారి, వై.సత్యవతి, లహరి, విజయవాణి, రాజమణి, పుష్పలత, మధుమతి, నాగలక్ష్మి, శశికళ పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి

మహిళా సాధికారతతోనే కుటుంబం, సమాజం తద్వారా దేశ అభివృద్ధి సాధ్యమని గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ అన్నారు. రామాటాకీస్ సమీపంలో గల సంస్థ కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రంగంలో ఉద్యోగం చేయాలన్నా, పిల్లలకు చదువు చెప్పాలన్నా ఆంగ్ల భాష కీలకంగా మారిందన్నారు. మహిళలు ఉద్యోగాలు సాధించేలా రెండు దశాబ్దాలుగా స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తన వద్ద శిక్షణ పొందుతున్న మహిళలను ఘనంగా సత్కరించారు.

- ఘండికోట సాహితీ పీఠం, విశాఖ సాహితి సంయుక్తంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి సతీమణి వేదుల ప్రభావతి, ఎస్.రాజకుమారిని ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు సత్కరించారు. విశాఖ సాహితి అధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని, అయ్యగారి సీతారత్నం, ఘండికోట విశ్వనాథం పాల్గొన్నారు. అక్కయ్యపాలెంలోని వాగ్దేవి పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. రమేష్ చంద్‌జైన్, ఎం.వి.రాజశేఖర్, ఎం.వి.వి.సత్యనారాయణ, ఎం.శ్రీలక్ష్మి శైలజ పాల్గొన్నారు.

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో మహిళా కళాకారులకు సాయం చేశారు. కోశాధికారి ఎం.శేషామణి ఇంటి వద్ద నిరుపేద మహిళా కళాకారులు 16 మందికి చీరలు పంపిణీ చేశారు. అనంతరం లవ్ అండ్ కేర్ వికలాంగుల ఆశ్రమానికి నిత్యావసర సరకులు అందించారు. ఇక్కడ పిల్లల సంరక్షణ చూస్తున్న ఇద్దరు మహిళలకు చీరలు అందించారు. కార్యక్రమంలో పి.కమల, ఎం.శేషామణి, సీహెచ్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

- మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైశాఖి స్పోర్ట్స్ పార్కులో సేవలు అందిస్తున్న మామిడి హేమలతకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఉప్పలపాటి శుభ, ఎం.జయ, మంగాదేవి పాల్గొన్నారు.

ఉత్తమ సోషల్ వర్కర్‌గా కీర్తి పట్నాయక్

గత రెండు దశాబ్దాలుగా నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మురళీనగర్‌కు చెందిన శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ ట్రస్టు చైర్‌పర్సన్ కుప్పిలి కీర్తి పట్నాయక్ ఉత్తమ సోషల్ వర్కర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు నగరంలోని చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మాతా శిశు సంక్షేమ శాఖ పీడీ జయదేవి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

సీతంపేట: ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో మహిళా దినోత్సవం ఘనంగా జరిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ హరిణి, డాక్టర్ రమ్య, న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ రమేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరవ అతిథులను గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులు అభినందించి సత్కరించారు. కోలా శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు, గద్ద చిరంజీవి, రామ సంతోషి కుమారి, కోన ప్రకాష్, ప్రసాద్ పాల్గొన్నారు.

సీతమ్మధార: సీతమ్మధారలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అనంతరం జీవీఎంసీ యూసీడీ విభాగం పీడీ సత్యవేణిని, సీతమ్మధార రైతుబజార్ రైతు శబరి (94)ని ఎమ్మెల్యే సతీమణి సీతాసుజాత ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జోన్ – 5 ఏపీడీ పుణ్యవతి, పలువురు ఆర్పీలు, నాయకులు పాల్గొన్నారు.

- సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో అపార్ట్‌మెంట్ నివాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు వేడుకలు నిర్వహించారు. పలువురు మహిళలు ఆనందోత్సాహాలతో నృత్యాలు చేశారు. కల్చరల్ కమిటీ చైర్‌పర్సన్ ఉషారాణి అట్లూరి, సంయుక్త కార్యదర్శి సింధూ సురేష్, అంజులత, రేమా అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.



మహిళలను సత్కరిస్తున్న గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య బాలమోహన్‌దాస్



పేద కళాకారులకు చీరలు అందిస్తున్న క్లబ్ సభ్యులు



కీర్తి పట్నాయక్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



పీడీ సత్యవేణిని సన్మానిస్తున్న సీతా సుజాత, బీజేపీ శ్రేణులు

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన



దంత పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మద్దిలపాలెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 50వ వార్డులో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు అనీల్ నీరుకొండ దంత వైద్య కళాశాల సౌజన్యంతో శనివారం మాధవధార మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీ మాధవ యువజన సమాజం ప్రాంగణంలో శిబిరం ఏర్పాటు చేశారు. వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులు, సమాజం సభ్యులను కొనియాడారు. ఇటువంటి శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ యుక్త అధ్యక్షతన డాక్టర్ ప్రహర్ష ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆనందరావు, సుజాత, మాధవ యువజన సమాజం అధ్యక్షుడు సనపల రాంగోపాల్, సనపల వరప్రసాద్, సనపల నారాయణ స్వామి, పప్పల రామచంద్రరావు, పొన్నాడ రాంబాబు, శ్రీరామ్మూర్తి, నారాయణ రావు, అనిల్ నీరుకొండ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట: స్థానిక సీతంపేటలో గల జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా అలవెల్లి వెంకట సునీల్ గుప్తాకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2,35,000 చెక్కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల వైద్యానికి అవసరమైన సాయం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం జనసేన మహిళా నాయకురాలు లలిత ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవాల్లో పాల్గొని పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుండు సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల ఎల్‌వోసీ అందజేత

సీతమ్మధార: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీని అందజేశారు. నగరానికి చెందిన పెనుమత్స సుబ్బరాజు కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం రూ. 3 లక్షలు విడుదల చేయగా ఎమ్మెల్యే అందజేశారు.

భగవంతుని లీలలు అద్భుతం



పంచాంగం ఆవిష్కరిస్తున్న వెంకటరమణ, తదితరులు

సీతమ్మధార : భగవంతుడు కాల స్వరూపుడని, దయామయుడని, ఆయన లీలలు అంతుపట్టవని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురుపీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. సీతమ్మధారలో గల జగద్గురుపీఠంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా నూతన పంచాంగాన్ని సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యదేవ్ కొన్ని సాధనా పరమైన విషయాలు వివరించారు. దైవాన్ని కాలస్వరూపునిగా భావించి, ఆరాధిస్తే కాలం, ప్రకృతి సహకారం లభిస్తుందని చెప్పారు. అందరి క్షేమం కోసం పాటుపడడంలో సంతృప్తి లభిస్తుందని, ప్రతి ఒక్కరూ తోటివారికి సహకారం అందించాలని మావూరి వెంకటరమణ సూచించారు. పంచాంగకర్త కారుపర్తి కోటేశ్వరరావు సిద్ధాంతిని అభినందించారు. కోటేశ్వరరావు సిద్ధాంతి మాట్లాడుతూ అంతా గాయత్రి మాత అనుగ్రహమని, పంచాంగ శ్రవణం శాస్త్రీయమైనదని చెప్పారు. కార్యక్రమంలో సర్వాణి వర్మ, సంస్కృత అధ్యాపకుడు జంపన శ్రీరంగనాథ్ పాల్గొన్నారు.

విమ్స్ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల ధర్నా

అరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికులు శనివారం జాతీయ రహదారిని ఆనుకొని ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. కరోనా సెకండ్ వేవ్‌లో 42 రోజుల వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ మొదటి కరోనా సమయంలో కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్లకు నెలకు రూ.16,000 వేతనం అమలు చేశారన్నారు. రెండో సారి కరోనా సమయంలో ఆ వేతనం చెల్లించలేదన్నారు. 42 రోజుల వేతనాన్ని వెంటనే చెల్లించకపోతే ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆ కాంట్రాక్టర్‌పై విమ్స్ డైరెక్టర్ దర్యాప్తు జరిపించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ పీఆర్ బిషోయి సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం, కోరాపుట్ జిల్లాకు చెందిన గోబర్ధన టిక్రి, చంద్ర పాంగి విశాఖపట్నం మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. 18.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

- జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కర్ణాటక రాష్ట్రం, బెంగళూరుకు చెందిన అస్గర్ ఆలీ, సయ్యద్ తన్వర్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీ దళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మత స్వేచ్ఛ హరిస్తున్నారు'



సెమినార్‌లో అతిథులు, క్రైస్తవ మత పెద్దలు

తాటిచెట్లపాలెం: దేశంలో మత స్వేచ్ఛను హరిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. మత స్వేచ్ఛ అనే అంశంపై కైలాసపురం రోడ్‌లో గల గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో గరికిముక్కుల పాల్ విక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో డాక్టర్ కూచిపూడి బాబూరావు, శామ్యూల్ ఆనంద్, డాక్టర్ కాకుమాను రాజ శిఖామణి, డాక్టర్ పులుగుజ్జు సురేష్ మాట్లాడారు. దేశంలో మత స్వేచ్ఛ హరిస్తున్న వారిపై పోరాడేందుకు పలు క్రైస్తవ సంస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు. భారత రాజ్యాంగం క్రైస్తవులకు కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతికూల పరిస్థితుల్లో న్యాయ సహాయం అవసరమైతే తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో బి.ఫ్రాంక్లిన్ సుధాకర్, సీఆర్ఐఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు క్రిస్టోఫర్ డేవిడ్ బొజ్జ, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి, అఖిల భారత క్రైస్తవ హక్కుల మండలి అధ్యక్షుడు పాస్టర్ ప్రేమ్ తరంగ, ఉత్తరాంధ్ర నుంచి బిషప్స్, ఆర్చి బిషప్స్, పాస్టర్స్, మత పెద్దలు పాల్గొన్నారు.

హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న సత్యనారాయణ

సీతమ్మధార : చిరు వ్యాపారులకు అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వీధి విక్రయదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు షేక్.రెహమాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆశీలమెట్టలోని జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరక్క... పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక వలస వచ్చి విశాఖ నగరంలో అనేక సంవత్సరాల నుంచి అద్దె ఇళ్లలో నివసిస్తూ చిరు వ్యాపారం చేసుకుని జీవిస్తున్నామన్నారు. వ్యాపారం చేసుకునేందుకు సరైన షెల్టర్ లేక ఎండకు ఎండుతూ... వర్షాలకు తడుస్తూ... సరకులు తడిచిపోయి అమ్ముడుపోక అప్పుల పాలవుతున్నామని వాపోయారు. వీటికి తోడు పోలీసులు, జీవీఎంసీ అధికారులు కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ అధికారులు సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అమలు చేసి అన్ని ప్రాంతాల్లో హాకర్స్ జోన్లు ఏర్పాటు చేసి చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. ముద్ర రుణాలు మంజూరు చేసి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.ఎ.అచ్యుత్ రావు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాసుబాబు, ఎస్.నాగభూషణ్, ఎస్.నగేష్, ఎస్.వినోద్, పి.ప్రకాష్, ఎ.అనసూయ, రాము తదితరులు పాల్గొన్నారు.